# పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపకల్పన

**జిల్లాలో కొత్తగా మరో 5 పోలింగ్ కేంద్రాలు**

**స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ**


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, అక్టోబర్ 14 : జిల్లాలో ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించే దిశగా ఓటరు జాబితా సవరణ-2025 ప్రక్రియను చేపడుతున్నామని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్టోరల్ రోల్, ఎపిక్‌లో వ్యత్యాసాల తొలగింపు చేర్పులు, మార్పులతోపాటు జాబితాలో ఓటర్ల ఫొటోలు స్పష్టంగా ఉండేవిధంగా, బోగస్‌కార్డుల ఏరివేత, మృతుల పేర్లు తొలగించి పకడ్బందీగా తుది జాబితా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత జిల్లాలో మరో 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాలేరు పరిధిలో రెండు, సత్తుపల్లి పరిధిలో 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల, నవంబర్ 28 వరకు ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ, డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలు పరిష్కరించి 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి రాజేష్, కాంగ్రెస్ ప్రతినిధి గోపాల్‌రావు, బీఆర్ఎస్ ప్రతినిధి ఫ్రాన్సిస్, సీపీఎం ప్రతినిధి ప్రకాష్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు వెంటనే పరిష్కారం

**ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య**


అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, అక్టోబర్ 14 : ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికశాతం ఫిర్యాదులు రెవెన్యూశాఖకు సంబంధించినవే వస్తున్నందున తన చాంబర్‌లోనే ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసి సమస్యలను అక్కడిక్కడే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి గతవారం జరిగిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఇంత వరకు ఎందుకు పరిష్కారం కాలేదని సంబంధితశాఖ అధికారులపైన కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారంలో వచ్చిన ఫిర్యాదులకు రెండు వారాల్లో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రతి సెక్షన్ నుంచి ఒక అధికారి కంప్యూటర్ ఆపరేటర్‌తో సహ ప్రజావాణి రోజున అందుబాటులో ఉండాలని, వచ్చిన ఫిర్యాదులు ఏ స్టేజీలో ఉన్నాయో వివరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొత్త టీచర్లకు కలెక్టర్ అభినందన

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 14 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని టీచర్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు 53మంది కాగా వారిలో 33మంది ఎస్‌జీటీ, 20మంది స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైనట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం..

ప్రభుత్వ ఐటీఐల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు ట్రేడుల్లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ సంప్రదించాలని కోరారు.

## నేడు చలమాల వర్ధంతి

పెనుబల్లి, అక్టోబర్14ః: స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు చలమాల సూర్యనారాయణ 42వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

## నేటి నుంచి క్రీడాజ్యోతి ర్యాలీ

రఘునాథపాలెం, అక్టోబర్ 14 : ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తయారుచేయాలనే లక్ష్యంతో రాష్ట్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో నవంబర్‌లో నిర్వహించే ముఖ్యమంత్రి కప్-2024లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి క్రీడాజ్యోతి ర్యాలీని నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి తంబూరు సునీల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ర్యాలీ ప్రారంభమై 15వ తేదీన జిల్లాలోని ఏన్కూరు మండలం హిమనగర్ వద్దకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 4గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు క్రీడాజ్యోతి రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీలో జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు, అన్ని క్రీడాసంఘాల బాధ్యులు, క్రీడాభిమానులు పాల్గొనాలని కోరారు.

## పాత బస్టాండ్‌లో చైన్‌స్నాచింగ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 14 : ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన సోమవారం ఖమ్మం నగరంలోని ఆర్టీసీ పాత బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామానికి చెందిన కాటం కోటమ్మ ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో చైన్‌స్నాచర్లు మెడలో ఉన్న సుమారు మూడుతులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/S Shriram Finance Ltd. Kothagudem Branch Rep. by its Branch Manager it is stated that **Smt. Vallepu Nagamani,** W/o Veeranna, 40 years, occ. House wife, R/o H.No.5-2-248/G/76/1, Musthafa Nagar, Sriram Nagar Road No.10, Khammam Urban Mandal, Khammam District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 10 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

**SHEDULE OF THE PROPERTY**

RCC roofed Building bearing H.No.3-157 (with assessment no.532) with a plinth area of 277 Sq.feet; Acc roofed house with toilets in a plinth area of 208 Sq.feet along with electrical fittings, in the house site of an extent of 525.22 Sq.yards or 439.15 Sq.meters situated at Gattusingaram village, Kusumanchi Mandal, Khammam District, SRO limits of Kusumanchi bounded by: **EAST :** Agriculture land of Battula Chinna Veeranna **WEST :** G.P. Road. **NORTH:** House of Battula Veeramma. **SOUTH:** House of B.Laxman H.No.3-158 part.

**PALIVELA GANESH BABU**
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt :10.10.2024

## హమాలీలకు దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైరాటౌన్, అక్టోబర్14: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ రాయపూడి నారాయణరావు కుమారుడు రాయపూడి అయ్యప్ప పుట్టిన రోజు సందర్భంగా వైరాలో హమాలీలకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, కోశాధికారి మరికంటి రాంగోపాల్, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్ రావు, ఏపూరి రాజారావు, కొల్లా రాంబాబు, చెరుకూరు శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, రాయపూడి వెంకటేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

బోనకల్లు, అక్టోబర్ 14: మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం మండల అధికారులకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక రైతువేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ పున్నంచందర్, అదనపు ఎంపీడీవో మిట్టపల్లి రవికుమార్, ఎంపీవో శాస్త్రిలను కలిసి ఆయా సమస్యలను వివరించారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**PLOT FOR SALE**

★**గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర** గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.

NT-338783

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


సత్తుపల్లి: సదాశివునిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబర్14: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం మండలంలోని సదాశివునిపాలెంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఏ- గ్రేడ్ సన్నరకం రూ.2320, కామన్-గ్రేడ్ సన్నరకం రూ.2300తోపాటు, బోనస్ రూ.500 నేరుగా రైతుల ఖాతాల్లో అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఏపీఎం సుబ్బారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### భీమవరంలో..

వేంసూరు, అక్టోబర్14: మండలంలోని భీమవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, అధికారులు, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

### మదారంలో..

కారేపల్లి, అక్టోబర్ 14: మండలంలోని మాదారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్ సోమవారం ప్రారంభించారు. ఎంపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో నవీన్‌బాబు మాట్లాడుతూ మండలంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి బీ.అశోక్‌కుమార్, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఏఈవో ప్రకాశం, సీసీ సోందు, సొసైటీ కార్యదర్శి బల్లు హన్మంతరావు, అజ్మీరా నరేశ్, రైతులు పాల్గొన్నారు.

### కొర్లగూడెంలో..

పెనుబల్లి, అక్టోబర్ 14: కల్లూరు మండలంలోని కొర్లగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవీ సోమవారం ప్రారంభించారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో శ్రీనివాస్, స్థానికులు ప్రభాకర్‌చౌదరి, భూక్యా శివకుమార్, పెద్దబోయిన శ్రీనివాస్, మట్టా రామకృష్ణ, తురాబ్‌అలీ, రహ్మత్, తిరుపతి పాల్గొన్నారు.

### గన్నవరంలో..

వైరారూరల్, అక్టోబర్14: మండలంలోని గన్నవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో మయాన్ మంజుఖాన్, అధికారులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


బోనకల్లు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల స్పెషలాఫీసర్

బోనకల్లు/ చింతకాని/ తిరుమలాయపాలెం, అక్టోబర్ 14: ప్రభుత్వం ఏర్పాటుచేసిన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోనకల్లు మండల స్పెషల్ ఆఫీసర్ కటారు విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. బోనకల్లు మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసే సమయంలో నిబంధనలకు అనుగుణంగా రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన పంటసాగు పత్రాలను తీసుకురావాలన్నారు.

### చింతకాని, తిరుమలాయపాలెంలో..


తిరుమలాయపాలెం : జల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చావా వేణు, అధికారులు

చింతకాని, తిరుమలాయపాలెంలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, సొసైటీ చైర్మన్ చావా వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రకం ధాన్యానికి రూ.2,320, రెండో రకం ధాన్యానికి రూ.2,300 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని వివరించారు.

## ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


యూటీఎఫ్ నాయకులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి, అక్టోబర్ 14: కొత్తగా చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల నమోదు పెంపుదలకు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్ సతీష్ అధ్యక్షతన జరిగిన నూతన ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అభ్యర్థులు, పేద పిల్లలకు గుణాత్మక విద్య అందించాలని, కష్టపడి పనిచేసి తల్లిదండ్రులు ఆధారాభిమానాలు చూరగొనాలన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమవుతుందని, సమాజం ముందుకు పోవాలంటే విద్య కీలకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ రంజాన్, వీవీ రామారావు, జీఎస్ఆర్ రమేశ్, కే శ్రీనివాసరావు, కే విజయకుమార్, ఆర్ నాగేశ్వరరావు, జీ వీరస్వామి, ఎస్‌హెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

వేంసూరు, అక్టోబర్ 14: వ్యవసాయ కూలీలకు నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని, ప్రభుత్వ భూములల పంపిణీకి కోనేరు రంగారావు తరహా కమిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మహాసభ ప్రగతినగర్‌లో కిన్నెర మారయయ, తుమ్మల అంజమ్మ, కొమరవరపు భాగ్యమ్మ, కూతాడి వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం మండల మూడో సభలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా సామాన్య ప్రజలు, పేదలు, కూలీలు పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని, ధరలు తగ్గించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షురాలిగా రామలక్ష్మి, గౌరవ సలహాదారునిగా ఎస్కే రంజాన్‌బీ, అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటమ్మ, కిన్నెర రామయ్య, ఉపాధ్యక్షులుగా మహాలక్ష్మి, సహాయ కార్యదర్శిగా అంజమ్మ, కోశాధికారిగా శ్రీలతతోపాటు 17 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మి, ఎస్కే రంజాన్‌బీ, నారాయణరావు, షేక్ లాల్‌మొహమ్మద్, షేక్ హమీద్, అజయ్, కిన్నెర రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఇసుక బహిరంగ వేలం

మధిర, అక్టోబర్ 14: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ ఇసుకకు బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాచకొండ రాంబాబు సోమవారం తెలిపారు. భూగర్భ గనుల శాఖ అధికారులు రూపొందించిన కొలతల ప్రకారం 25 ట్రాక్టర్లలోని 75 క్యూబిక్ మీటర్లు, 5 టిప్పర్లలోని 65 క్యూబిక్ మీటర్లు కలిపి మొత్తం 140 క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించినట్లు వివరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 3 గంటల ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

వైరాటౌన్, అక్టోబర్ 14: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి డిప్యూటీ సీఎం మల్లు భట్టీవిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ ఎత్తుకొని మహిళలతో కలిసి ఆడిపాడారు.

**వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన నందిని**

వైరారూరల్, అక్టోబర్ 14 : మండలంలోని రెబ్బవరం గ్రామంలో కోదండ రామాలయానికి సుమారు రూ. కోటి విలువ చేసే 3 ఎకరాల భూమిని గుత్తా వీరయ్య విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ, కుటుంబ సభ్యులు రూ.3 లక్షల వ్యయంతో ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన గుత్తా వీరయ్య, ఆయన కుమార్తె వెంకట కృష్ణాకుమారి విగ్రహాలను ఆదివారం మల్లు నందిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాదం రామారావు, గుత్తా వెంకటేశ్వర్లు, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం, అక్టోబర్ 14: ఎర్రుపాలెం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆర్.శ్రీహరి కృష్ణ, అధ్యక్షుడిగా బీ.శివుడు, ఉపాధ్యక్షుడిగా జీ.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా బీ.దినేశ్, ట్రెజరర్‌గా వీ.గోపిచంద్, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డీ.హరిత, జే.అశోక్‌కుమార్, సీహెచ్.మధు, వెంకటేశ్వర్లు, జీ.ఏలేశ్వరరావు, కే.నరసింహారావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎంపీవో శ్రీలక్ష్మి అభినందించారు.

## 'భక్తరామదాసు' ఎత్తిపోతల ట్రయల్ రన్ సక్సెస్


ఎర్రగడ్డతండా వద్ద భక్త రామదాసు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈ రమేశ్‌రెడ్డి

కూసుమంచి, అక్టోబర్ 14: కూసుమంచి మండలంలోని ఎర్రగడ్డతండా వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌ను అధికారులు సోమవారం సక్సెస్ చేశారు. గత నెల 1న వచ్చిన భారీ వర్షాలు, వరదలతో భక్తరామదాసు ఎత్తిపోతల పథకం యూనిట్ నీటమునిగిన విషయం విదితమే. ఇన్నాళ్లూ దానికి మరమ్మతులు నిర్వహించిన అధికారులు.. శనివారం డ్రై రన్ చేశారు. సోమవారం నీటిని విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. ఇందులో భాగంగా నీరు తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్‌తండా వద్ద నీటిని శ్రీరాంసాగర్ కాలువల్లోకి వదిలారు. ఈ జలాలతో పాలేరు నియోజకవర్గంలోని 65 వేల ఎకరాలకు, మహబూబాబాద్ నియోజకవర్గంలోని కొన్ని చెరువులకు సాగునీటిని అందించనున్నారు. సోమవారం నీటి విడుదలను ఇరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈ రమేశ్ రెడ్డి పరిశీలించారు.

## వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

ముదిగొండ, అక్టోబర్ 14: మండలంలోని మాధాపురంలో వరి పంటలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. పంట చేతికొస్తున్న సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. బ్యాక్టీరియా వల్ల ఎండాకు తెగులు లక్షణాలు ఉన్నాయని, వెంటనే నత్రజని ఎరువు వేయడం ద్వారా తాత్కాలికంగా నివారించవచ్చని సూచించారు. ఈ తెగులును తొలిదశలోనే గుర్తించి నివారించాలన్నారు. పంట కోత దశలో ఉన్నప్పుడు కాపర్ శిలీంద్రనాశనాలను వినియోగించవద్దని సూచించారు. వర్షాలు లేనప్పుడు పొటాష్ ఎరువును వేయడం ద్వారా ఈ తెగులును అదుపు చేయవచ్చని అన్నారు. శాస్త్రవేత్తలు కే. రవికుమార్, ఫణిశ్రీ, ఏవో సరిత, ఏఈవో రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవాలు


నేలకొండపల్లిలో దుర్గామాత అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


కూసుమంచి గంగదేవిచెరువులో నిమజ్జనం


కూసుమంచి/ చింతకాని/ నేలకొండపల్లి (కూసుమంచి), అక్టోబర్ 14 : దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో గడిచిన పది రోజులపాటు ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలను భక్తులు ఆయా జలాశయాల్లో నిమజ్జనం చేస్తున్నారు. చింతకాని, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని పలు దుర్గామాత విగ్రహాలను ఆయా మండపాల నిర్వాహకులు సోమవారం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్లపై ఉంచి ఘనంగా శోభాయాత్రలను నిర్వహించారు. అమ్మవారి గీతాలు, డీజే పాటలు, పటాకుల మోతలు, నృత్యాలతో అమ్మవారిని జలాశయాల వరకూ తోడ్కొని వెళ్లారు. అనంతరం దుర్గాదేవిని గంగ ఒడికి చేర్చి వీడ్కోలు పలికారు.

## జోరుగా కోటమైసమ్మ జాతర


కోట మైసమ్మ జాతరలో భక్తజనం

కారేపల్లి, అక్టోబర్14: విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయం వద్ద జరుగుతున్న జాతర మూడోరోజు జోరుగా సాగింది. సోమవారం వర్షం కురుస్తున్నా జనాల తాకిడి తగ్గలేదు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్ రాజారాం ట్రాఫిక్ నియంత్రిస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూశారు. జాతరకు ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులతో కోటమైసమ్మ తల్లి దర్శించుకొని పూజలు చేశారు.

## సాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



వైరాటౌన్, అక్టోబర్ 14: పోలీస్ కానిస్టేబుల్ సాగర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఏన్కూరులోని కానిస్టేబుల్ సాగర్ స్వగృహానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గిరిజనసంఘాల నాయకులు ఉన్నారు.

## నేటి నుంచి పశువులకు 'గాలికుంటు' టీకాలు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 14: మండలంలో పశువులకు (ఆవులు, గేదెలు) మంగళవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యుడు అనంతుల హరీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత తేదీల్లో ఉదయం 7 గంటలకు ఆయా గ్రామాలకు పశువైద్యులు, సిబ్బంది చేరుకొని టీకాలు వేస్తారని చెప్పారు. రైతులు తమ పశువులను ఆ రోజున మేతకు విడిచిపెట్టకుండా ఇంటివద్దనే ఉంచాలని సూచించారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 16 వరకు ఈ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 15న సత్యనారాయణపురం, చిన్నతండా, 16న ఏదులాపురం, 17న గొల్లగూడెం, 18న ఆరెంపుల, 19-21 వరకు చింతపల్లి, 22న ఆరెకోడు, 23న ఆరెకోడు తండా, 24న బారుగూడెం, 25-28 వరకు గుదిమళ్ల, 29, 30 తేదీల్లో వెంకటగిరి, నవంబర్ 1, 2 తేదీల్లో ముత్తగూడెం, 4న దారేడు, 5న పడమటితండా, 6న జాన్‌బాద్ తండా, 7, 8 తేదీల్లో కామంచికల్, 9న రామన్నపేట, 11న దానవాయిగూడెం, 12, 13 తేదీల్లో కైకొండాయిగూడెం, 14-16 వరకు పెద్దతండా, నాయుడుపేట గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేయనున్నట్లు వివరించారు.

**మధిర రూరల్లో..**

మధిర రూరల్, అక్టోబర్ 14: మధిర మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా మంగళవారం నుంచి పశువుల ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకుమారి సోమవారం తెలిపారు.

## 'సమన్వయంతో పనిచేయడమే సంతోషం'


ఏడీని సన్మానిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ముదిగొండ, అక్టోబర్ 14: సమన్వయంతోనే పనిచేయడమే సంతోషాన్నిచ్చిందని ఏడీ భీమ్‌సింగ్ పేర్కొన్నారు. ఇన్నాళ్లూ విద్యుత్ శాఖ ముదిగొండ ఏడీగా పనిచేసిన భీమ్‌సింగ్ బదిలీపై పెనుబల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి సోమవారం ఇక్కడ ఏడీని సత్కరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. వ్యవసాయ, గృహ వినియోగాలకు అందరి సహకారంతోనే విద్యుత్‌ను సరఫరా చేశామని అన్నారు. ఏఈలు శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వరి పొలాల పరిశీలన

కొణిజర్ల, అక్టోబర్ 14: మండలంలోని పెద్దగోపతిలో వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయాధికారి బాలాజీ పరిశీలించి రైతులకు పలుసూచనలు చేశారు. వాతావరణ మార్పుల వల్ల వరిలో బ్యాక్టీరియా లీఫ్‌బ్లైట్ ఉందని తెలిపారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఎండుతెగులు వస్తుందని, మొదటి వరి ఆకులు, గోధుమ రంగులోకి మారి తర్వాత ఆకులు చివరి నుంచి ఎండునట్టుగా కనిపిస్తుందన్నారు. వరిలో ఆకు ఎండుతెగులు ఉన్న సమయంలో యూరియా వేయవద్దన్నారు. ఎంఏవో బాలాజీ, ఏఈవో శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.